నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, గురువారం 5 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA

బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

ఓదార్చి.. ధైర్యం చెప్పి

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- మూడు రోజులవుతున్నా సాయం శూన్యం
- రావిరాలకు సీఎం రాకపోవడం దురదృష్టకరం
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత
- బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల అందజేత

నెల్లికుదురు, సెప్టెంబర్ 4 : ఇటీవలి భారీ వర్షాలతో ఎక్కడా లేని విధంగా నెల్లికుదురు మండలంలోని రావిరాల గ్రామం నీట మునిగి సర్వంకోల్పోయిన ప్రజలకు మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అండగా నిలిచారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆమె వరద బీభత్సానికి కూలిన ఇండ్లు, కొట్టుకపోయిన గొర్లు, ద్విచక్ర వాహనాలు, కట్ట తెగి చుక్క నీరులేని చెరువును పరిశీలించారు. బాధితులను అక్కున చేర్చుకుని వారి కన్నీళ్లు తుడిచి ఓదార్చారు. ఇప్పటివరకు ప్రభుత్వం అందించిన సాయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ వరదలతో రావిరాలలో ఇంత విధ్వంసం జరిగినా సీఎం రేవంత్ ఇక్కడికి రాకపోవడం దురదృష్టకరమని, బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. గ్రామానికి చెందిన తూళ్ల సాగర్ తమ కుటుంబ సభ్యులతో డాబాపైకి చేరి కాపాడాలంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌ను చూసి తన వాళ్లను అలర్ట్ చేశానన్నారు. గ్రామంలో మంత్రి సీతక్క పర్యటించి ఒక్క పైసా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నీట మునిగిన పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఇండ్లు కూలిపోయినోళ్లకు ఇండ్లు నిర్మించివ్వాలని, ప్రతి కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని 150 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆకుల జగ్గయ్య, శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండా వెంకన్న, వైస్ చైర్మన్ భోజ్యానాయక్, నల్లాని నవీన్‌రావు, ముత్యం వెంకన్న గౌడ్, ఎర్రబెల్లి నవీన్‌రావు, ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సింగాపురంలో నేలవాలిన మక్కజొన్న పంట


ఆత్మకూరు : కటాక్షపురంలో పత్తిలో ఉన్న నీరు

డోర్నకల్ : మోదుగుగడ్డ తండాలో మిర్చితోటలో వేసిన ఇసుకమేట

40 చెరువులు తెగిపోయాయి

జిల్లావ్యాప్తంగా కురిసిన అతి భారీ వర్షాల వల్ల జిల్లాలో 40 చెరువులు పూర్తిగా తెగిపోయాయి. మరో 20 చెరువులు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. తెగిపోయిన చెరువుల కింద రైతులు వేసిన వరి పంట పూర్తిగా నీట మునిగింది. చెరువులు తెగిపోవడంతో చెరువు కింద సాగు చేసుకునే రైతులకు సాగు నీరు లేకుండా పోయింది.

నీరు లేక వెలవెలబోతున్న రావిరాల పెద్ద చెరువు

ధ్వంసమైన రోడ్లు

ఒకేసారి వరద పోటెత్తడంతో వాగులు, వంకలు చెరువులు కుంటలు అనే తేడా లేకుండా వరద విజృంభించింది. జిల్లావ్యాప్తంగా ఉన్న రోడ్లు ధ్వంసం అయ్యాయి. జిల్లాలో పది చోట్ల రోడ్లు పూర్తిగా తెగిపోయాయి. ఇవి ఎప్పటివరకు మరమ్మతు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మరో 10 చోట్ల రోడ్లు తెగిపోయి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది ఆర్‌అండ్‌బీ శాఖకు సుమారు రూ.3కోట్ల వరకు నష్టం వాటిల్లింది.

గంగారం : కోమట్లగూడెంలో కూలిన కాసుల సారయ్య పెంకుటిల్లు

ఇండ్ల పరిస్థితి దారుణం

జిల్లావ్యాప్తంగా కురిసిన అతి భారీ వర్షాలతో వరదలు రావడంతో చాలావరకు ఇల్లు కూలిపోయాయి. జిల్లావ్యాప్తంగా 15 ఇండ్లు పూర్తిగా కూలిపోగా, మరో 99 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. పూర్తిగా కూలిపోయిన ఇండ్ల వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చింది.

రావిరాలలో మంచినీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

రావిరాలలో తడిసిన బియ్యాన్ని తీసుకెళ్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

కోలుకోని మానుకోట

వరద బాధితుల్లో అంతులేని ఆవేదన

మహబూబాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఇటీవలి భారీ వర్షాలతో మానుకోట కకావికలం అయింది. ఇల్లు, వాకిలి, గొడ్డుగోద ఇలా సర్వం కోల్పోవడంతో వరద ప్రభావిత ప్రాంతాలు ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇంట్లోని సామగ్రి, బియ్యం, ఉప్పులు, పప్పులు, ఇతర సామగ్రి అంతా వరద నీటిలో తడిసిపోయి తినేందుకు తిండి లేక అల్లాడుతున్నారు. ఇళ్లల్లో ఉండ లేక, నిత్యావసర సరుకులు ఇచ్చినా వంట చేసుకొనే వీలు లేక తండ్లాడుతున్నారు. అంతేగాక వేలాది ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోయి రైతన్నలు లబోదిబోమంటున్నారు. సుమారు 27వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు సమాచారం. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొనగా వరదలతో దెబ్బతిన్న గ్రామాల్లో జరిగిన నష్టంపై జిల్లా అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

- వరద బీభత్సంతో జనం ఆగమాగం
- ఇల్లువాకిలి కోల్పోయి సతమతం
- 27వేల ఎకరాల్లో పంట నష్టం
- ధ్వంసమైన రోడ్లు, స్తంభించిన రవాణా వ్యవస్థ
- తెగిన చెరువు కట్టలు.. మేటలు వేసిన పంట పొలాలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర నష్టం

ట్రాన్స్‌కోపై తీవ్ర ప్రభావం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ రంగం పూర్తిగా దెబ్బతిన్నది. వరదలు వచ్చిన గ్రామాల్లో రెండు మూడు రోజులకు కానీ కరెంట్ తీయలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వరదల కారణంగా జిల్లావ్యాప్తంగా 700విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. 106 ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయాయి. దీంతో సంస్థకు రూ.35 లక్షల నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

నర్సింహులపేట : మక్కజొన్నలో నిలిచిన నీటిని చూపిస్తున్న మహిళా రైతు సునీత

27,544 ఎకరాల్లో నష్టం

జిల్లావ్యాప్తంగా గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వరద తాకిడికి వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. 27,544 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరి 16,810 ఎకరాలు, పత్తి 5764 ఎకరాలు, మక్కజొన్న 2798, ఇతర పంటలు 2172 ఎకరాల్లో నష్టం జరిగింది.

నర్సింహులపేట : వరదకు నేలవాలిన పెసర పంట

నర్సింహులపేట : చేనుపై మొలకెత్తిన పెసర

215 పశువుల మృతి

వరదల కారణంగా జిల్లావ్యాప్తంగా పశువులకు భారీ నష్టం వాటిల్లింది. ఇందులో గొర్రెలు, బర్రెలు, ఆవులు అన్నీ కలిపి 215 మృతిచెందినట్లు అధికారులు గుర్తించారు. పశు నష్టం ఎక్కువగా ఉండడంతో రైతులకు మరింత ఆందోళనకు గురిచేసింది.

వాహనాలు గల్లంతు

వరద తాకిడికి కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలో ఆకేరు వాగులో కారు, మహబూబాబాద్‌లోని రాళ్లవాగులో డీసీఎం కొట్టుకుపోయింది. ఇవి కాకుండా సీతారాంతండా, నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో సుమారుగా పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. మానుకోటకు కలిగిన నష్టం కష్టం అంతా ఇంతా కాదు. కోలుకోవాలంటే ఎంతో వ్యయంతో పాటు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

నీట మునిగిన నాలుగు గ్రామాలు

అతి భారీ వరదలకు జిల్లాలో పలు గ్రామాలతో పాటు కాలనీలు అతలాకుతలం అయ్యాయి. జిల్లాలో నెల్లికుదురు మండలం రావిరాల, మరిపెడ మండలం సీతారాంతండా, తేజావత్ తండా, భూక్యతండాలో నీట మునిగాయి. మరో 15 గ్రామాలు, 100కు పైగా కాలనీలో వరద నీరు వచ్చి చేరింది.


దామెర : పసరగొండలో నీటమునిగిన వరి పంట

కేసముద్రం : ఇంటికన్నె రైల్వే ట్రాక్ సమీపంలోని పొలాల్లో వేసిన ఇసుక మేటలు

తెగిన జాతీయ రహదారులు

అతి భారీ వరదల కారణంగా జిల్లాలో జాతీయ రహదారులు కొట్టుకుపోయాయి. చాలా ప్రాంతాల్లో పాక్షికంగా దెబ్బతిన్నాయి. పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద సుమారు 10 చోట్ల జాతీయ రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. అలాగే మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి మున్నేరు వాగు బ్రిడ్జి వద్ద కూడా జాతీయ రహదారి దెబ్బతిన్నది. వీటితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో జాతీయ రహదారి దెబ్బతిన్నది. రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది ఇప్పటికీ ఆర్టీసీ బస్సులు నడపలేని పరిస్థితిలో ఉంది.

నేటి నుంచి రైళ్లన్నీ యథాతథం

- ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి
- కాజీపేట, వరంగల్ మీదుగా రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట/ఖిలావరంగల్/కేసముద్రం, సెప్టెంబర్ 4 : కాజీపేట– విజయవాడ సెక్షన్‌లో గురువారం నుంచి తిరిగి రైళ్లన్నీ యథాతథంగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం– ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాల కింద కంకర కొట్టుకుపోవడంతో ఎక్కడి రైళ్లు అక్కడే నిలిచిపోయాయి. రైల్వే ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపదికన రాత్రింబవళ్లు సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఒక లైన్‌ను పునరుద్ధరించడంతో గుంటూరు –సికింద్రాబాద్ గోల్కొండ, హైదరాబాద్– విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్, చెన్నయ్ సెంట్రల్, ఎంవీడీ కాట్రా ఎక్స్‌ప్రెస్, త్రివేంద్రం, నిజాముద్దీన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ బుధవారం వేగం తగ్గించి ట్రయల్ రన్‌గా నడిపించినట్లు వివరించారు. ఢిల్లీ– చెన్నై సెక్షన్‌లోని పలు ముఖ్య రైళ్లను నడిపించనున్నట్లు చెప్పారు. రాత్రి వరకు పట్టాల మరమ్మతులు పూర్తి స్థాయిలో జరుగుతాయని తెలిపారు.

సికింద్రాబాద్– గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుకు రెండు గంటల ఆలస్యంతో రీ షెడ్యూల్ చేశామని, లింగంపల్లి–కాకినాడ పోర్టు గౌతమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

మురుగు వాసన.. తప్పని యాతన

- సీతారాంతండాలో అంతులేని కష్టాలు
- తూతూమంత్రంగా సహాయక చర్యలు

కురవి: తండావాసులతో మాట్లాడుతున్న ఎస్పీ

కురవి: బయటపడేసిన గడ్డకట్టిన సిమెంట్

కురవి/మరిపెడ : 54 ఇండ్లు.. 174 జనాభా.. ఏ ఇంటి మీద నుంచి చూసినా పారే ఆకేరు వాగు.. పచ్చని పంట పొలాలతో భూమిపై గీత గీసినట్టున్న అందమైన పల్లె మరిపెడ మండలం సీతారాంతండా. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా సాగే గిరిజనులు తమ పంటపొలాలకు దగ్గరలో తండాలుగా ఏర్పడి జీనవం సాగిస్తారు. 40 ఏళ్ల వ్యవధిలో నాలుగు పర్యాయాలు వరద వచ్చినా కొద్దిమేర నష్టం వాటిల్లేది. కానీ ఆదివారం తెల్లవారుజామున జలప్రళయం మిగిల్చిన చేదుజ్ఞాపకాల నుంచి సీతారాంతండా కోలుకోలేకపోతున్నది. బుధవారం తండాను 'నమస్తే తెలంగాణ' సందర్శించగా వాన భయం నుంచి గిరిజనులు తేరుకోలేదు. సీఎం రేవంత్ వచ్చి వెళ్లినా కూడా తండాలో అదే పరిస్థితి నెలకొంది. యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన సహాయక చర్యలు అందక బిక్కుబిక్కుమంటున్నారు. సాయంత్రం కాగానే పిల్లపాపలతో లచ్యతండా సమీపంలోని రైతుబాంధవుడు కేసీఆర్ నిర్మించిన రైతువేదికలో తలదాచుకుంటున్నారు. ధాన్యం తడిసిన మురుగు వాసన వస్తుండడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. వండుకునేందుకు గిన్నెలు లేవు.. తమరు ఇచ్చిన నిత్యావసర వస్తువులు పెట్టుకుందామంటే స్థలం లేదు.. ముట్టిద్దామంటే గ్యాస్ పొయ్యి లేదు. మరో పదిరోజులు అన్నం పెట్టండి సార్ అని గ్రామానికి వచ్చిన ప్రత్యేకాధికారి, డీసీవో నర్సింహారావును దీనంగా వేడుకున్నారు.

ఎస్పీ సార్.. 12 గంటలైనా నీళ్లు తాగలేదు

వరద ఉధృతికి కొట్టుకుపోయిన పురుషోత్తమాయగూడెం వంతెనను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించి మరమ్మతు పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అనంతరం సీతారాంతండాకు వెళ్లి తండావాసులతో మాట్లాడారు. 12 గంటలైనా మంచినీళ్లు కూడా తాగలేదు సర్ అంటూ యువకులు ఎస్పీకి చెప్పుకోగా త్వరగా వారికి టిఫిన్ పెట్టించాలని అధికారులను ఆదేశించారు.

అధైర్యపడకండి మేమున్నాం

సీతారాంతండా, ధర్మారం తండాలకు కలిపి డీసీవో నర్సింహారావును జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా నియమించారు. మరిపెడ పీహెచ్‌సీ వైద్యాధికారి రవి, ఆర్ఐ శరత్, జూనియర్ అసిస్టెంట్ అశోక్, ఎంపీవో సోమ్లా, కార్యదర్శి అశోక్‌లతో కలిసి బుధవారం ఆయన తండా అంతా కలియతిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అధైర్యపడకండి మేమున్నాం.. వాన కురుస్తుంటే ఆ కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. పూర్తిగా నిలువ నీడలేని రెండు రేకుల ఇండ్ల యజమానులకు పట్టాలను అందజేశారు. వంట చేసి తండావాసులకు అందచేయాలని ఎంపీవో, కార్యదర్శిని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలన్నారు. తండావాసులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్య ఉన్నా దృష్టికి తీసుకురావాలన్నారు.

– ప్రత్యేక అధికారి, డీసీవో నర్సింహారావు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

రాష్ట్ర స్థాయికి ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది మంది ఎంపిక

వెంకట్రాంరెడ్డి, అమరేందర్ రెడ్డి, రాజయ్య, రజనీకాంత్, చల్ల షర్మిల, సుధాకర్

ములుగు, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/గిర్మాజీపేట/హనుమకొండ చౌరస్తా/భూపాలపల్లి రూరల్/ కాటారం/జనగామ చౌరస్తా : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో వీరికి అవార్డులు ఇవ్వనున్నారు. హసన్‌పర్తిలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే ఇందుమతి, భూపాలపల్లి జిల్లా కొంపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎన్ అమరేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గూడెల్లి రాజయ్య, కాటారం గిరిజన గురుకులం బాలుర కళాశాల చిత్రకళా ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్, వెంకటాపురం(నూగూరు) మండలం అలుబాక జడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయురాలు షర్మిల, జఫర్‌గఢ్ మండలం తిడుగు జడ్పీహెచ్ఎస్ ఎస్జీటీ కుందూరు సుధాకర్‌లను రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. కాగా, వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ వెంకటయ్య ఉత్తమ ప్రిన్సిపాల్‌గా, నర్సంపేట జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకుడు ఎల్ కొమురారెడ్డి ఉత్తమ లెక్చరర్‌గా ఎంపికైనట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. శాయంపేట మండలం పెద్దకోడెపాకకు చెందిన బైరు వెంట్రాంరెడ్డి ఉత్తమ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా గుట్టురట్టు

- ఎనిమిది మంది అరెస్ట్..

నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ

మట్టెవాడ, సెప్టెంబర్ 4 : నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. బుధవారం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ వివరాలు వెల్లడించారు. పస్తం సతీశ్ తన వడ్డీ వ్యాపారం లైసెన్స్ రెన్యువల్ కోసం దేశాయిపేటకు చెందిన జూలూరు చక్రపాణిని సంప్రదించాడు. తహసీల్దార్ ధ్రువీకరించినట్లుగానే సర్టిఫికెట్ ఇస్తానని వరంగల్ కొత్తవాడకు చెందిన గోవిందు సతీశ్ వద్దకు తీసుకెళ్లాడు. అంతకుముందు నుంచే సతీశ్‌తో పాటు మండిబజార్‌కు చెందిన ఖాజా మహమ్మద్, అజారుద్దీన్, కాజీపేటకు చెందిన సయ్యద్ సాబీర్, మాకుల దామోదర్, ఎనుమాములకు చెందిన కాశెట్టి కమలాకర్, సిరంగి రమేశ్ ఎమ్మార్వోల సంతకాలను ఫోర్జరీ చేస్తూ ఫ్యామిలీ మెంబర్‌తో ఇతర సర్టిఫికెట్లను ఇస్తున్నారు. ఈ క్రమంలో సతీశ్‌పై వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాజీపేట ఎమ్మార్వో, హెచ్ఎన్‌కే జిల్లా పేరిట ఉన్న రబ్బర్ స్టాంప్‌లను, వరంగల్ ఎమ్మార్వో కార్యాలయ ముద్రను, తహసీల్దార్ సీల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రబ్బర్ స్టాంపులు తయారు చేసిన సముద్రాల కిరణ్‌కుమార్‌తో పాటు ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. అధికారులను సీపీ అంబర్‌కిశోర్ అభినందించారు.